నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
10 | మహబూబ్‌నగర్, శనివారం 10 మే 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

సోలార్ పవర్ ప్లాంట్ ఎదుట రైతుల ధర్నా

ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

వెల్దండ, మే 9 : మా పేరిట ఉన్న పట్టా భూమి మాకే చెందాలని శుక్రవారం వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి గ్రామ సమీపంలో ఉన్న అజూర్ సోలార్ పవర్ ప్లాంట్ ఎదుట శుక్రవారం రైతులు మల్లమ్మ, రాములు మరి కొంత మంది రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. రాచూర్ శివారులోని సర్వేనెంబర్లు 2, 38, 239లలో 3-30 గుంటల భూమి మా పేరుపై ఉందని, మా భూమి మాకు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. 2006 సంవత్సరంలో రాచూర్‌కు చెందిన కొందరు రైతులు వద్ద భూమి కొనగా, తర్వాత మాకు తెలియకుండా కొందరు మోసపూరితంగా అమ్ముకున్నారని వాపోయారు. ప్రస్తుతం మా భూమి అజూర్ సోలార్ పవర్ ప్లాంట్ ఆధీనంలో ఉందని, చట్టప్రకారం పాసు పుస్తకాలు మా పేరుపై ఉన్నాయని తెలిపారు.

నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంజూరు పత్రాలతో ఫిర్యాదు

నాగర్‌కర్నూల్, మే 9 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్న సంతోషం ఆ గ్రామస్తులకు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. గత జనవరిలో ఆర్డీవో, తాసీల్దార్ కలిసి గ్రామంలోనే గ్రామ సభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని మంజూరు పత్రాలను నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామస్తులకు అందజేశారు. దీంతో గ్రామస్తులు పూరి గుడిసెలు, మట్టి మిద్దెలను కూల్చుకొని ఇందిరమ్మ ఇంటి కోసం బేస్‌మెంట్ నిర్మించుకున్నారు. తీరా మీకు ఇండ్లు మంజూరు కాలేదని అధికారులు చావుకబురు చల్లగా చెప్పడంతో దిక్కుతోచక స్థితిలో పడిపోయారు. ఇండ్లు మంజూరు కాలేదని గ్రామ పంచాయతీ అధికారి ద్వారా తెలుసుకున్న తుర్కపల్లి గ్రామస్తులు శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌ను ముట్టడించి అదనపు కలెక్టర్ అమరేందర్‌తో తమ గోడును వెల్లబోసుకున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద తమ గ్రామాన్ని ఎంపిక చేసి తమకే ఇండ్లు రాలేదని అధికారులు చెప్పడం ఏమిటని మండిపడుతున్నారు.

నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న తుర్కపల్లి గ్రామస్తులు

'పాలమూరు'ను పూర్తిచేయాలి

- కేసీఆర్ హయాంలోనే 90శాతం పనులు పూర్తి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్ఎస్‌లో చేరిన హన్వాడ మండల కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 9 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వెంటనే పూర్తిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో న్యూటౌన్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలమూరు రైతులను అదుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును తీసుకొచ్చారన్నారు. ప్రాజెక్టు పనులు బీఆర్ఎస్ హయాంలో 90శాతం పూర్తిచేశామని, 10శాతం పనులు మిగిలి ఉండగానే ప్రభుత్వం మారడంతో పూర్తి చేయలేకపోయామన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రాజెక్టు టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన మండిపడ్డారు. పనులు త్వరగా పూర్తిచేసి ఉమ్మడి జిల్లాలోని చెరువులను నింపి వచ్చే సీజన్ నాటికి రైతుల పొలాలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుంటే చూస్తూ ఊరుకోబోమని రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టుపై త్వరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి తమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు.

హామీలపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ కార్యాలయంలో హన్వాడ మండలానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ-2 యాదయ్య, మాజీ సర్పంచులు సురేశ్‌నాయక్, రాందాస్, మన్యనాయక్, శ్రీనివాసులు, నాయకులు మాసయ్య, దస్తయ్య, వెంకటేశ్ యాదవ్, షేక్ మహ్మద్, గోపాల్‌తోపాటు 200మంది కార్యకర్తలు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. వారికి మాజీ మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఏడాదిన్నర కావస్తున్నా రైతులకు సక్రమంగా రుణమాఫీ జరగలేదని, రైతు బంధు.. రైతు బీమా అందడంలేదని, కనీసం రైతులు పండించిన పంట కొనడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి కాంగ్రెస్ నాయకులు వస్తే ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీయాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని ప్రజలు ఇప్పుడిప్పుడే చర్చించుకుంటున్నారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు పేడితే భయపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. వచ్చే ఎన్నికలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం..కేసీఆర్ సీఎంగా ప్రజలకు మంచి పాలన అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత ఇతర పార్టీలో చేరిన నాయకులు తిరిగి పార్టీలోకి వస్తున్నారని..పార్టీ సీనియర్ లీడర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హన్వాడ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ నరేందర్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సీనియర్ నాయకులు చెన్నయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసులు, అనంత్‌రెడ్డి, అన్వార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు

అయోమయం

- అవగాహన లేక లబ్ధిదారుల ఇక్కట్లు
- కొలతల్లో గీత దాటితే అనర్హత వేటు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆరుగురికి అందని మొదటి విడుత సాయం
- అర్హులైనా ఇతర పార్టీల వారైతే లిస్టులో పేర్లు మాయం

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించింది. కానీ ప్రభుత్వం విధించిన కొర్రీలతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. సొంత స్థలం ఉన్నా ఇండ్ల కొలతల్లో గీత దాటితే లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటిస్తుండడంతో ఆందోళన గురవుతున్నారు. ఇదిలా ఉండగా.. అమ్రాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన లబ్ధిదారులకు మొదటి విడుతలో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయగా, బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణం చేసుకోగా వీరు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాదని లిస్టులో నుంచి పేర్లు తీయించగా లబోదిబోమని మొత్తుకుంటున్నారు. ఇలా అర్హత ఉన్నా అడ్డంకులు సృష్టిస్తుండడంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మూడడుగులు ముందుకు, ఏడడుగులు వెనక్కిలా మారిపోయింది.

ముందుకు సాగని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

నాగర్‌కర్నూల్, మే 9 : తెలంగాణలో పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. వింత సమస్యతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. నిరుపేదలు సొంత స్థలం ఉండి నిర్మించుకుంటున్న ఇండ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కొలతలకు గీత దాటితే అలాంటి లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటిస్తుండడంతో నిరుపేదల్లో ఆందోళన నెలకొన్నది. సరైన అవగాహన లేక ఉన్నంత స్థలంలో ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు కొలతలతోపాటు మరిన్ని ఆంక్షలు విధించడం తో అర్థం కాని పరిస్థితులు నెలకొంటున్నాయి. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం విషయంలో అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని పలువురు బాధితులు ప్రభుత్వంపై విస్మయానికి గురవుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం మొదట్లో చెప్పిన విధంగా సొంత జాగా ఉన్న పేదవారు 400నుంచి 600చదరపు అడుగుల విస్తీర్ణంలో తమకు నచ్చిన విధంగానే ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు విడుతల వారీగా రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని ప్రభుత్వమే పేర్కొన్న విషయం తెలిసిందే. కాగా కొందరు లబ్ధిదారులు ఈ నిబంధనలను సక్రమంగా తెలుసుకోలేకపోయారు. తొందరపాటులో 600 చదరపు అడుగులకంటే ఎక్కువ స్థలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటి విడుతలో ఆరుగురు లబ్ధిదారులకు రూ. లక్ష రూపాయల సాయం అందకుండా పోయాయి. 600చదరపు అడుగుల స్థలం కంటే ఎక్కువ స్థలంలో ఇండ్లను కట్టుకున్న వారు పేదవారు కాదని, వారికి ఇందిరమ్మ ఇంటి పథకం వర్తించదంటూ అధికారులు తేల్చి చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మొదటి విడుతలో జిల్లా వ్యాప్తంగా ఒక్కో మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసి జిల్లాకు 816 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికి 145ఇండ్లు బేస్‌మెంట్లు పూర్తి కాగా, 95 మందికి మాత్రమే రూ.లక్ష సాయం అందింది. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్‌లో ముగ్గురు లబ్ధిదారులు, బల్మూర్ మండలం జినుకుంట గ్రామాల్లో ముగ్గురు లబ్ధిదారులకు మొదటి విడుత సాయం అందలేదు. అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నారని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై కిందిస్థాయి అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల గ్రామాల్లో కలెక్టర్ సంతోష్ ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన సమయంలో బయటపడగా, సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించినట్లు సమాచారం. మొదటి విడుతలో సాయం అందని లబ్ధిదారులు ఆవేదనకు గురవుతున్నారు. సొంతస్థలం ఉన్నందునే ఇల్లు కట్టుకుంటున్నామని, ధనవంతులం కాదని వాపోతున్నారు. అవగాహన లేకపోవడంతోనే ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని, ప్రభుత్వం చెప్పిన కొలతలు తమకు అర్థం కాకపోవడంతోనే ఇలా నిర్మాణం చేపట్టామని కొందరు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి కారణాలు చూపి తమకు సాయం చేయకపోవడం అన్యాయమని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని మానవతా ధృక్పథంతో న్యాయం చేయాలని ఇండ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

పెండ్లి పందిరిలో అమర జవాన్‌కు నివాళి

పెండ్లి పందిరిలో మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నూతన వధూవరులు, ప్రజలు

మరికల్, మే 9 : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్‌కు మరికల్ మండలంలోని బుడ్డెగాని తండావాసులు పెండ్లి పందిరిలో ఘనంగా నివాళులర్పించారు. బుడ్డెగాని తండాకు చెందిన అనిల్ కుమార్, రక్షిత పెండ్లి వేడుకల్లో భారత్-పాక్ యుద్ధంలో అమరుడైన మురళీనాయక్‌కు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. పాక్‌కు భారత సైన్యం తగిన గుణపాఠం చెబుతుందని తండావాసులు పేర్కొన్నారు. అనంతరం జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. మరికల్ మండలకేంద్రంలో కూడా అఖిలపక్ష నాయకులు మురళీనాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

వంగూరు కాంగ్రెస్‌లో లుకలుకలు

- నేతలను మందలించిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- మనస్తాపంతో మండల అధ్యక్ష పదవికి పండిత్‌రావు రాజీనామా

వంగూరు, మే 9 : సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలమైన వంగూరులో కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. ఎప్పుడూ లేనంతగా ఎమ్మెల్యే మండల నాయకులపై విరుచుకుపడటం చూసిన వారు నివ్వెరపోయారు. కల్వకుర్తి పట్టణంలోని ఓ రహస్య ప్రాంతంలో గురువారం కాంగ్రెస్ మండల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్య నేతలను మందలించడంతో వారు మనస్తాపం చెందారు. కొందరు బయటపడకపోయినప్పటికీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు శుక్రవారం మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామంలోని తన ఇంట్లో విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1970 నుంచి కాంగ్రెస్‌లో పని చేస్తున్నానని తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్ఎస్‌లో చేరి ఉద్యమాలు చేశానని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడంతో తిరిగి కాంగ్రెస్‌లో చేరానన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎవరూ కాంగ్రెస్ మండల బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు రాకపోతే అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచన మేరకు పార్టీ బాధ్యతలు తీసుకొని ఆహర్నిశలు పార్టీ అభివృద్ధికి కృషి చేసి మండలంలో మెజార్టీ తీసుకొచ్చానన్నారు. ఇంత కష్టపడిన తనను పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ఇష్టానుసారంగా మాట్లాడి అవమానించడం ఎంత వరకు సబబు అన్నారు. ఎమ్మెల్యే వైఖరితోనే మండలం కాంగ్రెస్ పార్టీ నాశనమైందన్నారు. దుందుభీలో ఇసుకను అక్రమార్కులకు అప్పజెప్పింది మీరు కాదా అని ప్రశ్నించారు. అధికారులను ఇష్టానుసారంగా బదిలీ చేస్తుంటే మండలంలో మాకు విలువేడుంటుందన్నారు. పార్టీ అభివృద్ధితో పాటు ప్రజల కోసం అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటే ఇప్పుడు ప్రొటోకాల్ యాదికొచ్చిందాంటూ ఘాటుగా విమర్శించారు. అధికారం లేనప్పుడు పార్టీకి దూరంగా ఉన్న వ్యక్తుల మాటలు విని తనపై ఘాటుగా మాట్లాడటం సరి కాదన్నారు. దీంతో మనస్తాపం చెంది కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు పండిత్‌రావు ప్రకటించారు.

పర్యావరణానికి గొడ్డలి వేటు

- చెట్ల నరికివేతతో తరుగుతున్న అటవీ సంపద
- కరువైన అటవీశాఖ పర్యవేక్షణ

బొగ్గు బట్టీ వద్ద వివిధ రకాల కలప మొద్దులు

కోడేరు మే 9 : చల్లని నీడనిచ్చే వృక్షాలను కొందరు కలప వ్యాపారులు నిర్దాక్షిణ్యంగా నరికివేస్తున్నారు. వృక్ష సంతతి అంతరించడంతో వాతావరణంలో వేడి స్థాయికి మించి జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నది. మండలంలోని నర్సాయపల్లి రిజర్వ్ ఫారెస్టులో అటవీ శాఖ అధికారులు ఆధ్వర్యంలో పెంచుతున్న నీలగిరి వనాలను కొందరు కలప వ్యాపారులు నరికివేసి అక్రమంగా తరలిస్తున్నారు. అదే విధంగా సర్కార్ భూముల్లోనే గాకుండా రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరుగుతున్న చెట్లను సైతం నరికివేస్తున్నారు. నర్సాయపల్లి, ఎత్తం, పసుపుల గ్రామాల్లోని గట్టు, అటవీప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు నాటిన చెట్లను నరికివేస్తున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. హరితహారం పథకం కింద ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు పెట్టి మొక్కలను నాటుతుండగా అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కలప వ్యాపారులు ఇష్టానుసారంగా చెట్లను నరికి తీసుకుపోతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల సమీపంలో కొందరు బొగ్గు బట్టీల వ్యాపారులు వేప, తుమ్మ, నీలగిరితో పాటు వివిధ రకాల చెట్లను నరికి వేసి బొగ్గు బట్టీలలో కాల్చుతున్నారు. బొగ్గు బట్టీలకు కేవలం సర్కార్ తుమ్మ చెట్లను మాత్రమే వాడాల్సి ఉండగా వారు అన్ని రకాల చెట్లను నరికివేసి బొగ్గు బట్టీల్లో కాల్చుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అటవీ ప్రాంతాల్లో ఉన్న మొక్కలపై పర్యవేక్షణ చేసి అక్రమ కలప వ్యాపారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సాయపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో నీలగిరి చెట్లను నరికివేసిన దృశ్యం

మొక్కుబడిగా గ్రామసభలు

- కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణానికి సుముఖత చూపని అన్నదాతలు
- ఎకరాకు రూ.80లక్షల వరకు నష్టపరిహారం అందిస్తేనే సంతకాలు పెడుతామని తేల్చి చెప్పిన కర్షకులు
- రైతులకు హామీని ఇవ్వకుండానే సభలను ముగించిన అధికారులు

మక్తల్ మండలం ఎర్నగాన్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభకు హాజరైన ముగ్గురు రైతులు

ఉదయం 11:15గంటలకే గ్రామసభ ముగించుకొని తిరుగుముఖం పట్టిన ఆర్డీవో

మక్తల్, మే 9 : నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ చేపట్టడం కోసం మక్తల్ తాసీల్దార్ సతీశ్‌కుమార్ అధ్యక్షతన మక్తల్ మండలంలో కాట్రేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూసేకరణ గ్రామసభకు ఆర్డీవో రాంచందర్ ముఖ్యఅతిథిగా హాజరై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు తమకు ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన హామీ వచ్చిన తర్వాతనే ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. గతంలో భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణంలో కాట్రేపల్లి గ్రామానికి చెందినటువంటి 300ఎకరాల భూమి రైతుల కోల్పోవాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. మళ్లీ ఇప్పుడు మిగిలి ఉన్న కొంత భూమిని కూడా రిజర్వాయర్ నిర్మాణానికి ఇస్తే మాకు ఎలాంటి జీవనాధారం లేకుండా పోతుందని ఆర్డీవో దృష్టికి రైతన్నలు తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న ప్రతి రైతుకూ మక్తల్ మండలంలోనే పట్టా భూమిని అందించాలని, ఒకవేళ భూమి ఇవ్వకపోతే, ప్రాజెక్టులో భూమి కోల్పోతున్న రైతులందరికీ ఎకరాకు రూ.70లక్షల నుంచి రూ.80లక్షల వరకు నష్టపరిహారం అందించిన తర్వాతనే ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులు రైతులకు ఏం సమాధానం చెప్పాలో తోచక నివ్వెర పోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అనంతరం ఆర్డీవో రాంచందర్ మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం కాట్రేవుపల్లి శివారులో పంప్ హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం భూమి సేకరణ చేసేందుకు గ్రామసభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంప్ హౌస్, సబ్‌స్టేషన్ కోసం 24ఎకరాల 11 సెంట్లు, 67ఎకరాల 36 సెంట్ల భూమిని భూసేకరణ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేస్తారని, రైతులకు తమ అభిప్రాయాలు వెల్లడించాలనే లక్ష్యంతో గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో రైతులు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారంగా పరిహారం ఇస్తామంటే, ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని అధికారులకు తెలిపారు. గ్రామసభ తీర్మానంలో భూముల కోల్పోతున్న రైతులు ఎవరూ సంతకాలు చేయకపోవడంతో అధికారులు మాత్రమే సంతకాలు పెట్టి గ్రామసభ ముగించి తదుపరి గ్రామానికి వెళ్లారు. అలాగే ఎర్నగాన్‌పల్లిలో ఉదయం 11 నుంచి 12గంటల వరకు నిర్వహించాల్సిన గ్రామ సభను అధికారులు 10:45 గంటలకే ప్రారంభించడంతో ఒకే ఒక్క రైతు హాజరు కాగా తన అభిప్రాయాన్ని తీసుకొని 20నిమిషాలలో గ్రామసభను ముగించి అధికారులు మామ అనిపించారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు నిర్దిష్టమైన హామీలను ఇవ్వకుండానే, పేరుకే గ్రామ సభలు నిర్వహించి అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని భూముల కోల్పోతున్న రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గన్నీ బ్యాగులతోపాటు లారీలను పంపిస్తాం

సింగిల్ విండో కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మరికల్, మే 9 : 'గన్నీ బ్యాగులివ్వరూ..' అనే శీర్షిక శుక్రవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితం కాగా వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. గురువారం సింగిల్‌విండో కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన రైతులను శుక్రవారం విండో కార్యాలయానికి పిలిపించుకొని వారి సమస్యలను నారాయణపేట జిల్లా వ్యవసాయ శాఖ మానిటరింగ్ అధికారి షాకీర్ పాషా అడిగి తెలుసుకున్నారు. రైతులకు సరిపడా గన్నీ బ్యాగులను అందిస్తామని, శనివారం లారీలను కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యల గురించి విండో చైర్మన్ రాజేందర్ గౌడ్, సీఈవో కృష్ణయ్యతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.